




APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర

గుంటూరు | సంపుటి -1 | సంచిక -97 | పేజీలు-4 | బుధవారం | 26 ఆగస్టు 2026 | వెల4/-



## శ్రీశైలం వద్దెర సత్రంలో దారుణం

ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య

నెలరోజులుగా సత్రంలోనే ఉండడంపై అనుమానాలు

వివరాలు 2వ పేజీలో

# కొత్త ఓటర్ల జాబితా ముందే స్థానిక సమరం



న్యాయ నిపుణులతో మాట్లాడి తుది నిర్ణయం: సీఎం

బలి చేయడం జగన్ నైజం

స్కాముల్లోకి పార్టీ నేతలను దింపుతారు

కొంత ఎర వేసి.. చివరకు బలి చేస్తారు

మద్యం రవాణా స్కామ్‌లో జరిగిందిదే

దొరికిపోయిన ప్రతిసారీ జగన్ కులం, సెంటిమెంటు కార్డులను తీస్తారు

బీసీలకు న్యాయం జరగాల్సిందే..

దాని కోసం ఎంతవరకైనా పోరాడుదాం

మంత్రులతో లంచ్ భేటీలో సీఎం

**అమరావతి:** కొత్త ఓటర్ల జాబితా ప్రకటించక ముందే స్థానిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని మంత్రులు అభిప్రాయపడ్డారు. 'సర్' (ఎస్ఐఆర్) తర్వాత తాజా ఓటర్ల జాబితా అక్టోబరు 3న అమల్లోకి వస్తుందని... ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే మళ్లీ వార్డుల రిజర్వేషన్లు మారే అవకాశం ఉందని సీఎం దృష్టికి తెచ్చారు. అందువల్ల అక్టోబరు 3లోపే స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. మంగళవారం సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులతో చంద్రబాబు లంచ్ భేటీ నిర్వహించారు. ఎస్ఐఆర్ అనంతరం వచ్చే తాజా ఓటర్ల జాబితా ప్రకారమే స్థానిక ఎన్నికలకు వెళ్లాలంటూ కోర్టును ఆశ్రయించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మంత్రులు

మిగతా 2 లో



ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు

లోకభవన్లో ప్రమాణ స్వీకారం గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు అభినందనలు

## అద్భుత ఏర్పాట్లతో పుష్కరాలు

భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు

10 కోట్ల మంది పుణ్యస్నానాలు చేస్తారని అంచనా

181 కొత్త ఘాట్ల నిర్మాణంతో సహా 440 ఘాట్ల అభివృద్ధి

గోదావరి పుష్కరాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

2



## బిహార్ రాజధాని రణరంగం

కదం తొక్కిన విద్యార్థులు, నిరుద్యోగ యువత

టీచర్ నియామక పరీక్షల ప్రక్రియపై నిరసన

'సీఎం నివాసం ముట్టడి'కి యత్నం

జలఫిరంగుల ప్రయోగం, లాఠీచార్జి

పోలీసులపైకి రాళ్లు రువ్విన నిరసనకారులు

3

విద్యార్థులు, నిరుద్యోగుల నిరసనతో బిహార్ రాజధాని పట్నా దద్దరిల్లింది. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్కు వ్యతిరేకంగా యువత కదం తొక్కింది. వచ్చే నెలలో నిర్వహించనున్న ఉపాధ్యాయ నియామక పరీక్ష ప్రక్రియపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున ఉద్యమించారు. ప్రిలిమ్స్, మెయిన్స్ పద్ధతిలో కాకుండా ఒకే దఫాలో పరీక్ష నిర్వహించా లని, నెగెటివ్ మార్కుల్ని తీసివేయాలని, ఉద్యోగాలన్నీ స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## జనగణనలో కులగణన విధానం సరిగా లేదు

తెలంగాణ మోడల్‌లో కులగణన

ప్రశ్నావళి మార్చేందుకు అఖిలపక్షం ఏర్పాటు

ప్రధానికీ రాహుల్, ఖర్గేల లేఖ

3

## స్థానిక ఎన్నికల్లో పట్టుదలగా పనిచేయాలి

ఏకగ్రీవం జరిగిందా.. టికెట్ కట్!

నియోజకవర్గాన్ని వదిలి బయటకు వెళ్లరాదు

ఎన్నికల్లో గెలుపు వైసీపీకి అత్యంత ముఖ్యం

అధికార దుర్వినియోగం జరగకుండా అడ్డుకోవాలి

ముఖ్యనేతలతో ఎన్నికలపై జగన్ దిశానిర్దేశం



**అమరావతి :** స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే ప్రజలు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పష్టమైన తీర్పు ఇస్తారని అన్నారు. గతంలో స్థానిక ఎన్నికల సందర్భంగా అధికార

మిగతా 2 లో

## పునరుత్పాదక ఇంధన రంగంలో ముందుంటాం



ఇప్పుడు అనంతపురం అంటే ఉద్యోగాలు

కియా కార్లు, ఫైటర్ జెట్లు, రెన్యువబుల్ ఎనర్జీ కూడా..

ఇదంతా ఏపీ బ్రాండ్, విజనరీ సీఎంతో సాధ్యమైంది

2019-24 మధ్య పవన విద్యుత్ ప్రాజెక్టుల్లేవు

ఇప్పుడు సుజ్లాన్ రాకతో రెన్యువబుల్ ఎనర్జీ పెరిగింది

అనంతపురం జిల్లా రాయదుర్గంలో మంత్రి లోకేశ్

సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన

**అనంతపురం :** పునరుత్పాదక ఇంధన రంగంలో రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడమే లక్ష్యమని ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ అన్నారు. అనంతపురం జిల్లా అంటే కియా కార్లు, ఫైటర్ జెట్లు, రెన్యువబుల్ ఎనర్జీ అని చెప్పారు. ఒకప్పుడు ఈ జిల్లా నుంచి యువత ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేవారని, ఇప్పుడు ఆ రోజులు పోయాయని, ఇతర ప్రాంతాల వాళ్లు ఉద్యోగాలు వెతుక్కుంటూ అనంతపురం జిల్లాకు వచ్చే రోజులు వచ్చాయని వివరించారు. ఇదంతా ఏపీ బ్రాండ్, విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా

మిగతా 2 లో

## తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి అభివృద్ధి


రూ.840.41 కోట్లతో విస్తరణకు కేంద్రం ఆమోదం

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



**న్యూఢిల్లీ :** తెలుగు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి 365బీబీ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుట్టాయగూడెం-ఎల్ఎన్‌డీ పేట, పట్టిసీమ- కొవ్వూరు సెక్షన్ల మధ్య 45.09 కిలోమీటర్లతో

మిగతా 2 లో



## పెళ్లి చేసి తనను బలి పశువు చేశారు

జోగి కుమారుడికి అనేక సమస్యలు ఉన్నాయి

పెళ్లికి ముందు వాటిని దాచి పెట్టారు

వారు క్రైస్తవం అన్న విషయాన్ని వెల్లడించలేదు

మీడియా సమావేశంలో మేఘన వెల్లడి

.. వివరాలు 2లో

# స్థానిక ఎన్నికల్లో పట్టుదలగా పనిచేయాలి

మొదటి పేజీ తరువాయి



దుర్వినియోగం, దౌర్జన్యాలు, ప్రలోభాలు చూశామని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆషామాషీగా తీసుకోవద్దని జగన్ సూచించారు. ఇవి కేవలం గెలుపోటములకు సంబంధించిన ఎన్నికలు కాదని, పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన ఎన్నికలని అన్నారు. అధికార పార్టీ నుంచి ఎలాంటి ఒత్తిళ్లు, దౌర్జన్యాలు ఎదురైనా నాయకుడు తమ వెంట ఉన్నాడనే భరోసా కార్యకర్తలకు కల్పించాలని సూచించారు. పార్టీ ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు జగన్.. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, 175 అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీలు హాజరయ్యారు..ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటన తమకు అనుకూలంగా మారే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, జడ్పీ చైర్మన్, మేయర్ వంటి కీలక పదవులకు బలమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని పార్టీ నేతలకు సూచించారు. అవసరమైన చోట కార్యకర్తలకు అండగా నిలిచేందుకు కుటుంబ సభ్యులను కూడా పోటీలోకి దింపడానికి వెనుకాడవద్దని అన్నారు. ఏకగ్రీవాలకు అంగీకరిస్తే కఠిన నిర్ణయాలు ఉంటాయని జగన్ హెచ్చరించారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలు జరిగేందుకు అవకాశం ఇవ్వొద్దని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే, తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి కో–ఆర్డినేటర్లు పార్టీ అభ్యర్థులుగా ఉండరని తెలిపారు. ఎన్నికల అనంతరం అభ్యర్థులను ఎక్కడెక్కడ నిలబెట్టారు, వారికి ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంత బలంగా మద్దతిచ్చారనే అంశాలపై నివేదికలు తీసుకుంటానని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండటంతో అభ్యర్థి వ్యక్తిగత బలం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికలో భావోద్వేగాలు, వ్యక్తిగత ఈగోలకు తావివ్వకుండా అందరినీ కలుపుకొని వెళ్లాలని సూచించారు. ఒక్కో ఓటు కూడా కీలకమని, తొమ్మిది ఓట్లతో గెలిచిన సందర్భాలు, తొమ్మిది ఓట్లతో ఓడిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. 'గెలుపే ముఖ్యం.. గెలుపు కోసం ఈగోలను పక్కన పెట్టాలి' అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేసి, సమర్థుడైన కార్యకర్త చుట్టూ ఏకాభిప్రాయం తీసుకురావాలని జగన్ సూచించారు. రాబోయే 60 నుంచి 70 రోజులు నాయకులు తమ నియోజకవర్గాలను దాటి వెళ్లకుండా స్థానిక ఎన్నికలపైనే పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని అన్నారు. ఇంటింటి ప్రచారం ద్వారా వైఎస్సార్‌సీపీ పాలన, కూటమి పాలన మధ్య ఉన్న తేడాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పోలీసు అధికారులు తమ పదవులను దుర్వినియోగం చేయకుండా న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జగన్ కోరారు. కార్యకర్తలను వేధించే లేదా అన్యాయం చేసే అధికారుల వివరాలను నమోదు చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారులపై భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా తటస్థంగా వ్యవహరించాలని కోరారు వైసీపీ అధినేత వైఎస్ జగన్..

# పునరుత్పాదక ఇంధన రంగంలో ముందుంటాం

మొదటి పేజీ తరువాయి

రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లు మండలం హులికెర వద్ద సుజ్లాన్ విండ్ ఎనర్జీ సుమారు రూ. 10 వేల కోట్లతో చేపట్టిన 1325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులకు మంత్రి లోకేశ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. అలాగే విండ్ ఎనర్జీ స్మార్ట్ బ్లేడ్ ఉత్పత్తి ప్లాంట్ విస్తరణను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే.. "సుజ్లాన్ పవన విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుతో ఏపీలో నూతన అధ్యాయానికి నాంది పలికాం. ఆ సంస్థతో ఏపీకి రెండు దశాబ్దాలకు పైగా బంధం ఉంది. తొలినాళ్లలోనే ఏపీకి వచ్చి, తయారీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసి, బలమైన విండ్ ఎనర్జీ ఎకో సిస్టమ్ నిర్మించింది. ఈ విషయంలో నాటి సుజ్లాన్ ఎండీ, దివంగత తులసి తంతిని స్మరించుకోవాలి. స్వచ్ఛ ఇంధనం ప్రపంచ ప్రాధాన్యతగా మారకముందే ఆయన పునరుత్పాదక ఇంధనంపై నమ్మకం ఉంచారు. ఆయన దార్శనికతకు అనంతపురంలోనే బలమైన పునాది పడింది. 2019–24 మధ్య రాష్ట్రంలో పవన విద్యుత్ అభివృద్ధి దాదాపుగా నిలిచిపోయింది. ఆ కాలంలో కేవలం 6 మెగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యం మాత్రమే అదనంగా చేరింది. అనంతపురంలోని సుజ్లాన్ యూనిట్‌కు ఏడాదికి దాదాపు 1,260 మెగావాట్ల తయారీ సామర్థ్యం ఉంది. తద్వారా ప్రత్యక్షంగా దాదాపు 1200 మందికి ఉపాధి కల్పిస్తోంది. వారిలో 70 శాతానికి పైగా స్థానికులే. ఏపీ వ్యాప్తంగా సుజ్లాన్ ఇప్పటికే 2 వేలకు పైగా గ్రీన్ ఉద్యోగాలను సృష్టించింది. జిల్లాల్లో తయారీ రంగం అభివృద్ధి చెందాలి. యువతకు వారి సొంత జిల్లాలోనే ఉద్యోగాలు లభించాలి.

## విండ్ ఎనర్జీ రంగంలో సుజ్లాన్ సత్తా

భారతదేశ పవన విద్యుత్ రంగాన్ని ప్రపంచ పటంలో నిలిపిన సంస్థల్లో సుజ్లాన్ ఒకటి. ప్రస్తుత ప్లాంట్‌లో 4 వేల మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను కల్పిస్తామన్నారు. ఏపీలో సుజ్లాన్‌కు ఇప్పటికే దాదాపు 1600 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉంది. మరో 2700 మెగావాట్లు అభివృద్ధి, నిర్మాణ దశలో ఉన్నాయి. రాష్ట్రంలో 6.5 గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఈ డిజిటల్ మౌలిక వసతులకు అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు దాదాపు 25 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన అవకాశాన్ని సృష్టించవచ్చు. క్లీన్ ఎనర్జీలో సౌదీ అరేబియాగా ఏపీని తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం. వివిధ రూపాల్లో స్వచ్ఛ ఇంధనాన్ని ప్రపంచానికి ఎగుమతి చేయగల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలి. రాష్ట్ర స్థాయిలో 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం. పూర్తిస్థాయి ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్ నిర్మాణంలో భాగంగా ఎనర్జీ, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఫార్మాసూటికల్స్, ఆటోమొబైల్, కెమికల్స్, ఫిషరీస్, ఆక్వాకల్చర్, మాన్యుఫ్యాక్చరింగ్ వంటి అధిక వృద్ధి రంగాల్లో 22 పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, సుజ్లాన్ కలిసి 12వేల మంది యువతకు, అందులో 25 శాతం మహిళలకు గ్రీన్ ఎనర్జీ ఉద్యోగాల కోసం శిక్షణ అందిస్తున్నాం. ఉరవకొండ, విజయవాడలోని స్కిల్ డెవల్‌పమెంట్ సెంటర్లు పునరుత్పాదక ఇంధన రంగానికి కావాల్సిన ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులను సిద్ధం చేస్తున్నాయి. ఒక్క కియా పరిశ్రమ ఎన్ని కుటుంబాల్లో వెలుగు నింపిందో నేను పాదయాత్రలో స్వయంగా చూశాను. అప్పుడే 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రపంచమంతా తిరిగి కంపెనీలను తీసుకువస్తున్నాం. ప్రధాని మోదీ కూడా మన రాష్ట్రానికి కంపెనీలను తీసుకురావడానికి సహకరిస్తున్నారు. కంపెనీలను తీసుకురావడం మా బాధ్యత. అవకాశాలను అందిపుచ్చుకోవడం యువత బాధ్యత. అందుకే పరిశ్రమలతో నేరుగా అనుసంధానం చేసి, యువతకు అవసరమైన నైపుణ్యాలను నేర్పిస్తున్నాం" అని లోకేశ్ అన్నారు.


# తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి

రహదారి ఉన్నతీకరణ కోసం రూ.840.41 కోట్లతో కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 45 కిలోమీటర్ల 2 లేన్ల జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్లు నిర్మించనున్నట్లు గడ్కర్ తెలిపారు. ఈ రహదారి ఉన్నతీకరణతో పోలవరం ప్రాజెక్ట్, పరిసర గ్రామాలకు కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతం పొగాకు, చెరకు, ఫామాయిల్ తోటలతో నిండి ఉంటుందని.. ఈ హైవే అభివృద్ధితో మౌలిక సదుపాయాలు మెరుగు అవుతాయన్నారు. పంటల రవాణా వేగంగా, సురక్షితంగా జరుగుతుందని చెప్పారు. పంట పొలాల నుంచి మార్కెట్‌కు అనుసంధానం పెరుగుతుందని, స్థానికంగా జీవనోపాధి మెరుగవుతుందని గడ్కరీ పేర్కొన్నారు. అప్‌గ్రేడ్ చేసిన జాతీయ రహదారితో తెలుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ పెరగడంతో పాటు, ఇరురాష్ట్రాల ప్రయాణికులకు, పర్యాటకులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తులు సులభంగా ఘాట్ల వద్దకు చేరుకోవడానికి, పోలవరం ప్రాజెక్ట్ సందర్శించేందుకు వీలవుతుందన్నారు.

# కొత్త ఓటర్ల జాబితా ముందే స్థానిక సమరం

మొదటి పేజీ తరువాయి



ఆయన దృష్టికి తెచ్చారు. న్యాయ నిపుణులతో మాట్లాడిన అనంతరం దీనిపై ఒక నిర్ణయానికి వద్దామని సీఎం చెప్పారు. పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల చైర్మన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు పెట్టామని, ఇందులో ఎవరి బలం ఏమిటో తెలిసిపోతుందని స్పష్టం చేశారు. అధికారం ఉంది కదా అని కుంభకోణాలకు పాల్పడి వేల కోట్ల రూపాయలు దోచుకోవడం, అందులో పార్టీ నేతలను భాగస్వాములను చేసి, వారికి కొద్ది మొత్తం పడేసి.. చివరకు బలిచేయడం వైసీపీ అధినేత జగన్‌కు అలవాటేనని ముఖ్యమంత్రి అన్నారు. మద్యం రవాణా కుంభకోణంలో సరిగ్గా ఇలాగే జరిగిందని చెప్పారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్టుపై వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యల మీద ఈ సందర్భంగా చర్చ జరిగింది. మద్యం రవాణా కుంభకోణంలో కేసుకు రూ.12 రవాణా చార్జీకి బదులు రూ.35 వేసి వైసీపీ నేతలు అడ్డంగా దొరికిపోయారని మంత్రులు సీఎంతో అన్నారు. కారుమూరికి కొంత మొత్తం ఇచ్చి మెజారిటీ వాటాను ఎవరు తీసుకున్నారో తేల్చాల్సి ఉందని చెప్పారు. ఈడీ తనిఖీలు.. అరెస్టులు చేస్తే కూటమిపై ఆరోపణలు చేయడం వైసీపీ నేతలకే చెల్లిందని పలువురు వ్యాఖ్యానించారు. సీఎం స్పందిస్తూ.. ప్రజలకు అన్ని విషయాలూ తెలుస్తున్నాయని, మనం కూడా వారికి వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. వైసీపీ పాలనను ఒకసారి చూసిన జనం భయపడిపోయారని, ఆ పార్టీకి అధికారం ఇచ్చేందుకు సిద్ధంగా లేరని స్పష్టంచేశారు.

## బీసీలకు మేలు చేసిందే టీడీపీ..

బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీసీల్లోకి బలంగా తీసుకెళ్లాలని మంత్రులకు చంద్రబాబు సూచించారు. దీనిపై కోర్టుల్లో ఎన్ని వ్యాజ్యాలు దాఖలైనప్పటికీ ప్రభుత్వ వాదన బలంగా వినిపిద్దామన్నారు. "1995 నుంచీ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో కొనసాగుతున్నాయి. 2019లో చట్టాన్ని సవరించకుండా రిజర్వేషన్లపై జీవో ఇచ్చి అప్పటి సీఎం జగన్ బీసీ రిజర్వేషన్లు తగ్గించేందుకు కారణమయ్యారు. ఈ విషయాలన్నింటినీ బీసీల్లోకి బలంగా తీసుకెళ్లాలి. దీనిపై వైసీపీ బీసీ నేతలు సమావేశాలు పెట్టి చేస్తున్న వ్యాఖ్యలను మంత్రులు సమర్థంగా తిప్పికొట్టాలి. వైసీపీ నాయకులు స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. హైకోర్టులో బీసీ రిజర్వేషన్‌కు సంబంధించిన అంశంపై విచారణ వచ్చే నెల 2వ తేదీకి వాయిదా పడింది. ఆ తర్వాత ఏం జరుగుతుందో చూద్దాం. బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు సుప్రీంకోర్టు వరకు వెళదాం." అని సీఎం అన్నారు.

# అద్భుత ఏర్పాట్లతో పుష్కరాలు

**అఖండ గోదారిని ఆరాధించేలా పవిత్ర స్నానాలు**

**భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు**

**10 కోట్ల మంది పుణ్యస్నానాలు చేస్తారని అంచనా**

**181 కొత్త ఘాట్ల నిర్మాణంతో సహా 440 ఘాట్ల అభివృద్ధి**

**మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 పనులు**

**గోదావరి పుష్కరాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు**

**అమరావతి :** ప్రకృతి ఆరాధన–ఆధ్యాత్మిక చింతన మమేకం చేస్తూ గోదావరి పుష్కరాలు నిర్వహించా లని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడా పవిత్రత దెబ్బతిన కుండా, భక్తులకు సమస్యలు తలెత్త కుండా ఇప్పటి నుంచే చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7 వరకు 12 రోజులపాటు పుష్కరాలు అత్యంత వైభవంగా జరపాలని నిర్దేశించారు. పుష్కర వేడుకల్లో స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. పుష్కరాల్లో భాగంగా రూ.4,026 కోట్లతో చేపట్టిన 4,932 పనులకు సంబంధించి పురోగతిపై సచివాల యంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. పుష్కరాలకు ఇంకా 10 నెలల సమయమే ఉన్నందున త్వరితగతిన అన్ని పనులు ప్రారంభించి సకాలంలో పూర్తిచేయాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పదొద్దని స్పష్టం చేశారు. ఈ పనులకు సంబంధించి ఇప్పటికే రూ.899 కోట్లు ఆర్థిక శాఖ కేటాయింపులు జరిగాయని అధికారులు ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు తెలి పారు. వీటిలో పట్టణాభివృద్ధి. ఆర్ అండ్ బీ, జల వనరులు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి అత్యధిక పనులుఉన్నాయి. ఇందులో తూర్పు గోదావరి జిల్లాలో 1,869, పశ్చిమ గోదావరి జిల్లాలో 625, కోనసీమ జిల్లాలో 1,501, ఏలూరు జిల్లాలో 426, కాకినాడ జిల్లాలో 321, పోలవరం జిల్లాలో 190 పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనుల పూర్తికి అవసర మైన నిధుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టాలని, కేంద్ర సాయం కూడా తీసుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు.

## పుష్కరాలకు 10 కోట్ల మంది భక్తులు

2015 మహా పుష్కరాల్లో ఆంధ్రప్రదేశ్లో సుమారు 4,86 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు చేయగా, 2027లో 8 నుంచి 10 కోట్ల మంది గోదావరి పుష్కరాలకు తరలి వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు వివరించారు. రోజుకు సుమారు కోటి మంది పుణ్య స్నానాలు చేసే అవకాశం ఉందన్నారు. రద్దీని తట్టుకునేలా మొత్తం 440 ఘాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. వీ టిలో ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 181 కొత్త ఘాట్లను నిర్మిస్తున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 82 ఘాట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 40 ఘాట్లు, కోనసీమ జిల్లాలో 175 ఘాట్లు, ఏలూరు జిల్లాలో 44 ఘాట్లు, కాకినాడ జిల్లాలో 88 మాట్లు, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.

## ప్రపంచస్థాయి మౌలిక వసతులు

గోదావరి నదీ పరివాహక జిల్లాల్లోని 260 గ్రామ పంచాయతీలలో 50 గ్రామ పంచాయతీలను మోడల్ పుష్కర పంచాయతీలుగా అభివృద్ధి చేయ తలపె ట్టారు. పుష్కరాలు కాలుష్య రహితంగా చేసేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులు వినియోగించనున్నారు. అలాగే 11 బస్ స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. నదిలో భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా, పారి శుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రత, వసతి, సాంకేతిక పరిజ్ఞానంతో" సమగ్ర ఏర్పాట్లను అద్భుతం గా చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగ మం వరకు అనేక ఉప నదులు, వాగులు, ఏరులు కలుస్తున్నందున అఖండ గోదావరి పేరుతో పుష్క రాలు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు ఆనం రామ నారాయణ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, వై సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు

**లోకభవన్లో ప్రమాణ స్వీకారం**

**గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు అభినందనలు**



అమరావతి : ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లి ఖార్జునరావు ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని లోక్భవన్లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గవ ర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ఆయనతో ఏపీ లోకాయుక్తగా ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు హాజరయ్యారు. లోకా యుక్తగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ మల్లిఖార్జునరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. జిఏడి ముఖ్య కార్యదర్శి జె శ్యామలరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్ర ప్రదేశ్ లోకాయుక్తగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జున రావును నియమిస్తూ గవర్నర్ జారీ చేసిన అపాయింట్మెంట్ వారెంట్ను చదివి వినిపించారు. ప్రమాణ స్వీకారం అనంతరం, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త తల్లాప్రగడ మల్లిఖార్జునరావును గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు అభినందించి పుష్ప గుచ్ఛాలు అందించారు. అనంతరం లోక్ భవన్లో ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు గవర్నర్, ముఖ్యమంత్రి హాజర య్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, హైకోర్టు న్యాయమూర్తులు, డిజిపి హరీష్ కుమార్ గుప్తా, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. అనంతరాము, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీని వాస్, ఏపీ శాసనసభ సెక్రటేరియట్ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, న్యాయశాఖ అధికారులు, ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# బిహార్ రాజధాని రణరంగం

**కదం తొక్కిన విద్యార్థులు, నిరుద్యోగ యువత**

**టీచర్ నియామక పరీక్షల ప్రక్రియపై నిరసన**

**'సీఎం నివాసం ముట్టడి'కి యత్నం**

**జలఫిరంగుల ప్రయోగం, లాఠీచార్జి**

**పోలీసులపైకి రాళ్లు రువ్విన నిరసనకారులు**



**పట్నా :** విద్యార్థులు, నిరుద్యోగుల నిరసనతో బిహార్ రాజధాని పట్నా దద్దరిల్లింది. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్కు వ్యతిరేకంగా యువత కదం తొక్కింది. వచ్చే నెలలో నిర్వహించనున్న ఉపాధ్యాయ నియామక పరీక్ష ప్రక్రియపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున ఉద్యమించారు. ప్రిలిమ్స్, మెయిన్స్ పద్ధతిలో కాకుండా ఒకే దఫాలో పరీక్ష నిర్వహించా లని, నెగెటివ్ మార్కుల్ని తీసివేయాలని, ఉద్యోగాలన్నీ స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమిషన్ నిర్వ హించిన కంబైన్డ్ కాంపిటీటివ్ పరీక్షల్లో జరిగిన అవక తవకల దృష్ట్యా ఆ పరీక్షలను రద్దు చేయాలని పేర్కొ న్నారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియ. అక్రమాలపై కొన్ని వారాలుగా నిరసన తెలుపుతున్నప్పటికీ.. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సీఎం. నివాసం ముట్టడికి పిలుపునిచ్చారు. మంగళవారంఉదయం పట్నాలోని గాంధీ మైదాన్ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. వారిని అడ్డుకోవటానికి పోలీసులు.. సీఎం నివాసం వరకూ 5 కి.మీ.ల మేర కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. అయినప్పటికీ, యువత ముందుకు కదలటంతో వాటర్ కెనాన్లను ప్రయోగిం చారు. కానీ, గత నెలలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల్లోలాగే ఈసారి కూడా ఆందోళనకారులు వాటర్ కెనాన్లకు బెదరకుండా ఆ నీళ్లలో తడుస్తూ రెయిన్ డ్యాన్సులు చేశారు. వారు అలాగే ముందుకు సాగటంతో డాక్బంగ్లాచౌక్ వద్ద పోలీసులు లాఠీచార్జి జరిపారు. దీంతో నిరసనకారులు పోలీసుల మీద రాళ్ల విసి రారు. ఈ ఘర్షణలో ఆందోళనకారులతోపాటు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. కొన్ని గంటలపాటు పట్నా రణరంగంగా మారింది. పలువురు ఆందోళనకారుల్ని పోలీసులు అదు పులోకి తీసుకొని ఇతర ప్రాంతాలకు తరలించారు.

### వివాదాస్పదమైన చైర్మన్ వ్యాఖ్యలు

విద్యార్థుల నిరసనకు ముందురోజైన సోమవారం బీపీఎస్ సీ చైర్మన్ రాకేశ కుమార్సింగ్. 'రోడ్డు మీద ఏనుగు పోతుంటే వెయ్యి కుక్కలు మొరుగుతాయి' అంటూ చేసిన వ్యాఖ్య కూడా తీవ్ర వివాదానికి కారణమైంది. కొందరు విద్యార్థులు, ఉద్యోగార్థులు గత కొన్ని వారాలుగా పాట్నాలో చేస్తున్న ధర్నాను ఉద్దే శించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై యువత భగ్గు మంది. తమను వీధికుక్కలతో పోల్చటం ఏమిటని పలువురు యువతీ యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్జేడీ వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ కూడా ఈ వ్యాఖ్య లను ఖండించారు. దీనిపై రాకేశ్కుమార్సింగ్ విచారం వ్యక్తం 'చేసినప్పటికీ.. నిరసన ఆగలేదు. 32,388 ఉపాధ్యాయ పోస్టుల నియామకం కోసం ఈ నెల 18వ తేదీన బీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే, గతంలో లేని ప్రిలిమ్స్, మెయిన్స్ తరహా పరీక్ష విధానం, నెగెటివ్ మార్కులపై విద్యార్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది.

# జనగణనలో కులగణన విధానం సరిగా లేదు

**ప్రశ్నావళి మార్చేందుకు అఖిలపక్షం ఏర్పాటు**

**ప్రధాని మోడీకీ రాహుల్, ఖర్గేల లేఖ**

**న్యూఢిల్లీ,ఆగస్టు 25 :** జనగణన పద్ధతిపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మంగళవారం ఖర్గే, రాహుల్ సుదీర్ఘ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. కులగణలో తెలంగాణ మోడల్ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులాల నమోదుకు 'ఓపెన్-ఎండెడ్' విధానాన్ని అమలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కులాల లెక్కింపు విధానాలతో తీవ్ర నష్టం జరుగుతోందని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. 'ఒకే కులం వేర్వేరు పేర్లతో విడిపోయి లక్షలాది కులాల పేర్లుగా నమోదవుతాయని.. దీనివల్ల లెక్కింపు డేటా పూర్తిగా నిరుపయోగంగా మారుతుందని తెలిపారు. ప్రశ్నావళిలో 'వెనుకబడిన వర్గాలు' అనే పదమే లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ తరహాలోనే బీసీ, ఓబీసీ కులాల నమోదుకూ 'డ్రాప్-డౌన్ జాబితా' విధానాన్ని ఉపయోగించాలని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సూచించారు. తెలంగాణ (2024), బిహార్ (2022) సర్వేల్లో వాడిన కులాల జాబితా నమూనాలను ప్రధానికి పంపించారు. ప్రస్తుత గందరగోళ ప్రశ్నావళిని వెంటనే రద్దు చేసి, అన్ని పార్టీలు - నిపుణులతో చర్చించి ఓ కొత్త ప్రశ్నావళిని రూపొందిం చాలని ఖర్గే, రాహుల్ డిమాండ్ చేశారు. ఇదిలావుంటే రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అంతం చేయడానికి మోదీ ప్రభుత్వం కుట్రపన్నిందని, దీనిలో భాగంగానే కేంద్రానికి చెందిన వివిధ శాఖాల్లో ఖాళీగా ఉన్న 8.2లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయడంలేదని కాంగ్రెస్పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. మంత్రిత్వ శాఖల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులపై మీడియా నివేదికను ఉటంకిస్తూ విమర్శలు సంధించారు. '2015లో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 4.21లక్షల ఉద్యోగాలు భర్తీకాకుండా ఉన్నాయి. 2024కు వాటి సంఖ్య 8.24 లక్షలకు చేరాయి. రైల్వేల్లో 2.40లక్షలు, కేంద్ర హోంశాఖ పరిధిలో 1.10 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లోని 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలను రద్దు చేశారు. ఇవికాక రక్షణ రంగంలో 2.41 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఖర్గే తెలిపారు. ఒప్పంద ఉద్యోగులు 19శాతం నుంచి 49శాతానికి పెరిగారని వెల్లడించారు. ఇది ఒక్క ఉపాధి సమస్య మాత్రమే కాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన సామాజిక న్యాయం అంశం కూడా ఇమిడి ఉందని పేర్కొన్నారు. విద్య, ఉపాధి రంగాల్లో యువ భారతీయుల జీవితాలను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. దేశంలో 15 నుంచి 29 ఏళ్ల వయసు గల 8.7 కోట్ల మంది యువత చదువులు, ఉపాధికి దూరమయ్యారని, వారికి ఎటువంటి నైపుణ్య శిక్షణలూ అందడంలేదన్నారు. నీతిఆయోగ్ నివేదికను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో గత 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగుల శాతం పెరిగిందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ విమర్శించారు.

# భవిష్యత్ తరానికి బాధ్యతలు అప్పగించాల్సి ఉంది

**గడ్కరీ వ్యాఖ్యలతో రాజకీయ కలకలం**

**కేంద్రంలో కొత్త తరానికి అవకాశం ?**



**న్యూఢిల్లీ :** కేంద్ర మంత్రిమండలిలో మార్పులు చేర్పులపై గత కొంతకాలంగా ఊహాగానాలు వినిపిస్తున్న వేళ కేంద్రమంత్రని నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు రాజకీయకాకను రేపుతున్నాయి. యువతరానికి బాధ్యతలు అప్పగించాల్సన సమయం వచ్చిందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్తతరానికి బాధ్యతలు అప్పగించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ మేరకు మహారాష్ట్రలోని నాగ్పూర్లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గడ్కరీ తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. నేను చేయాలనుకున్నంత కాలం పనిచేశాను. ప్రస్తుతం నేను మునుపటిలా పనిచేయలేకపోతున్నా. ప్రజాపనుల్లో ప్రమేయం తగ్గిపోయింది. ఆ పనిని కొత్త తరాలకు అప్పగించాలి. కొత్తవారికి సీనియర్లు మార్గనిర్దేశం చేస్తున్నారు. నేను గత 30 ఏళ్లుగా ప్రజాజీవితంలో ఉన్నాను. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాను. అవార్డులూ అందుకున్నాను అని గడ్కరీ గుర్తుచేసు కున్నారు. అలాగే అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడారు. భవిష్యత్లో అభివృద్ధి పనుల సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పారు. మహారాష్ట్రలో ప్రతి ఆదివాసీ గ్రామానికి విద్యుత్ సదుపాయాన్ని కల్పించడమే తన లక్ష్యమన్నారు. త్వరలోనే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు కేంద్రమంత్రి రామ్దాస్ ఆఠవాలే వెల్లడించిన సంగతి తెలిసిందే. భాజపా, మిత్రపక్షమైన ఎన్సీపీకి చెందిన కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. సంస్థాగతంగానూ భాజపాలో భారీ మార్పులు జరిగిన సంగతి తెలిసిందే. మరోవైపు.. 20శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకాన్ని ప్రోత్సహిస్తోన్న నితిన్ గడ్కరీ ఆ విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ20 పెట్రోల్తో తన కుటుంబం లబ్ది పొందుతోందంటూ పలువురు నెటిజన్లు ఆన్లైన్లో డీప్ఫేక్ వీడియోలు, పోస్టులు పెడుతున్నారని బాంబే హైకోర్టును కూడా ఆశ్రయించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. ఈ నేపథ్యంలో ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ వార్తల వేళ గడ్కరీ మాటలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

మహారాష్ట్రలోని నాగ్పూర్లో జరిగిన ఓ కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడుతూ.. దాదాపు మూడు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో కొనసాగుతున్నానని గుర్తు చేసుకున్నారు. గతంలో పార్టీ, ప్రభుత్వం కోసం విస్తృతంగా పని చేశానని.. ఇప్పుడు తన చురుకైన పాత్రను క్రమంగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు బాధ్యతలు అప్పగించి, వారు పని చేసే అవకాశాన్ని కల్పించాలన్న అభిప్రాయాన్నీ ఆయన వ్యక్తం చేశారు. ఇకపై తీవ్రమైన పాలనాపరమైన ఒత్తిళ్ల కంటే సామాజిక సంక్షేమం, గిరిజన ప్రాంతాలు, రైతుల శ్రేయస్సుపైనే దృష్టి సారిస్తానంటూ నితిన్ గడ్కరీ సంకేతాలు ఇచ్చారు. మహారాష్ట్రలో ఏ గిరిజన గ్రామమూ విద్యుత్ సౌకర్యానికి దూరంగా ఉండకూడదన్న లక్ష్యాన్నీ గడ్కరీ ప్రస్తావించారు. 'చేసినంత కాలం చేశాను.. ఇప్పుడు కొత్త తరానికి అవకాశం ఇవ్వాలి' అని అన్నారు. గడ్కరీ చేసిన ఈ వ్యాఖ్యలు బీజేపీలో జరుగుతున్న తరాల మార్పుపై మరోసారి చర్చకు దారితీశాయి. ఇటీవల పార్టీ సంస్థాగత స్థాయిలో చోటుచేసుకున్న మార్పుల నేపథ్యంలో కేంద్ర మంత్రి తాజా వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

# ఇక పైలెట్లకూ డోపింగ్ టెస్ట్‌లు

**మాదక ద్రవ్యాలు వినియోగంచకుండా ఆంక్షలు**

**కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు**

**న్యూఢిల్లీ :** ఇకపై ఏడాదికి ఒక్కసారైనా విమాన పైలట్లకు డోప్ టెస్టులునిర్వహించాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. పైలట్లు మాదకద్రవ్యాల, మత్తు పదార్థాలు ఉపయోగించకుండా అరికట్టేందుకు, భవిష్యత్తులో కఠినమైన నిబంధనలు తెచ్చేందుకు డీజీసీఏ ప్రస్తుతం విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతోందని చెప్పు కొచ్చారు. ప్రస్తుతం మొత్తం పైలట్ల సంఖ్యలో 10 శాతం మందికి మాత్రమే డోప్ టెస్టులు నిర్వహించాలనే నిబంధన అమల్లో ఉందని చెప్పారు. ఏడాదిలో ఒకసారి ప్రతి పైలట్కూ పరీక్ష నిర్వహించేలా దీనిని మార్పు చేయాలనే అంశాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పరిశీలిస్తోందన్నారు. భద్రత, నిర్వహణ పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన ప్రస్తుత నిబంధనలను మరింత కఠినం చేసే మార్గాలపైనా డీజీసీఏ అధ్యయనం చేస్తోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా పుకెట్-దిల్లీ విమాన ఘటనపై మాట్లాడుతూ.. దీనిపై ఎయిర్క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు చేస్తోందన్నారు. విమానంలోని పైలెట్ డేటా రికార్డర్ దర్యాప్తు సంస్థ ఆధీనంలో ఉందని పేర్కొన్నారు. త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. థాయ్లాండ్ నుంచి దిల్లీకి వస్తున్న విమానం ఆగస్టు 4న తీవ్ర కుదుపులకు లోనైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం పైలట్లు ఇద్దరికీ డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. తొలి పరీక్షలో పైలట్-ఇన్- కమాండ్కు పాజిటివ్ వచ్చింది. దీని తర్వాత సైకోయాక్టివ్ పరీక్ష నిర్వహించగా.. గంజాయి సేవించినట్లు నిర్ధరణ అయ్యింది. ఈ ఘటనపై ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు జరుపుతోందని పేర్కొన్నారు. విమానం డేటా రికార్డర్లు, ఇతర భాగాలు సురక్షితంగా ఉన్నందున, త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం పైలట్ నెట్వర్క్లో కేవలం పదిశాతం మందికి మాత్రమే రాండమ్గా డోప్ టెస్టులు నిర్వహిస్తున్నారని రామ్మోహన్ వెల్లడించారు. ప్రతీ పైలట్కు సంవత్సరంలో కనీసం ఒక్కసారైనా రాండమ్గా పరీక్ష నిర్వహిం చాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని అన్నారు. విమాన ప్రయాణికుల భద్రత అత్యంత ముఖ్యమైనదని చెప్పారు. విమాన సంస్థల ఆపరేషనల్ ప్రభావం కూడా దెబ్బతిన కుండా ఈ రెండింటి మధ్య సమతుల్యత పాటిస్తామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.


# పెళ్లి చేసి తనను బలి పశువు చేశారు

**జోగి కుమారుడికి అనేక సమస్యలు ఉన్నాయి**

**పెళ్లికి ముందు వాటిని దాచి పెట్టారు**

**వారు క్రైస్తవం అన్న విషయాన్ని వెల్లడించలేదు**

**మీడియా సమావేశంలో మేఘన వెల్లడి**




**విజయవాడ :** మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నేత జోగి రమేష్ కుటుంబ వివాదం మరో మలుపు తిరిగింది. జోగి రమేష్ సోమవారం తన కుటుంబంపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ మీడియా ముందుకు వచ్చిన మరుసటి రోజే ఆయన కోడలు మేఘన విలేకరుల సమావేశం నిర్వహించి తీవ్ర ఆరోపణలు చేశారు. తనకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు తెలియజేసేందుకే మీడియా ముందుకు వచ్చానని ఆమె తెలిపారు. 2025 మేలో జోగి రమేష్ కుమారుడు రాజీవ్తో తన వివాహం జరిగిందని మేఘన తెలిపారు. తండ్రి తన సంతోషం కోసం ఎంతో కష్టపడి పెళ్లి చేశారని, జోగి రమేష్పై నమ్మకంతో తమ కుటుంబం తనను వారి ఇంటి కోడలిగా పంపిందని చెప్పారు. అయితే పెళ్లయిన కొద్దిరోజులకే తనను ఇబ్బందులకు గురిచేయడం ప్రారంభించారని ఆరోపించారు. రాజీవ్కు ఉన్న సమస్యలు కుటుంబ సభ్యులకు ముందే తెలుసని, అయినప్పటికీ తనతో వివాహం చేయడం అన్యాయమని అన్నారు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగానే విడిపోయామని జోగి రమేష్ చెబుతున్నారని, అసలు తమ మధ్య ఎలాంటి గొడవ జరిగిందో ఆయన చెప్పాలని మేఘన డిమాండ్ చేశారు. వాస్తవాలను పక్కదారి పట్టించేందుకే జోగి రమేష్ మీడియా ముందుకు వచ్చారని ఆరోపించారు. వివాహం అనంతరం ఎదురైన ఇబ్బందులను తన మామ, అత్తకు వివరించానని మేఘన తెలిపారు. సమస్యలను పరిష్కరించకుండా అదనపు కట్నం తీసుకురావాలని తనను వేధించారని జోగి రమేష్ కోడలు మేఘన ఆరోపించారు. రాజకీయ పలుకుబడి ఉందని, తాము చెప్పినట్లే వినాలని బెదిరించారని చెప్పారు. అదనపు కట్నం తీసుకొస్తేనే భర్త తనను సంతోషంగా చూస్తాడని అత్త చెప్పేవారని ఆరోపించారు. తన పెళ్లికి ముందు హిందువులమని చెప్పి వివాహం చేశారని, అయితే అత్తింటి కుటుంబం క్రైస్తవ మతాన్ని అనుసరిస్తున్న విషయం తనకు ముందుగా చెప్పలేదని మేఘన ఆరోపించారు. చిన్ననాటి నుంచి హిందూ సంప్రదాయాల ప్రకారం పూజలు చేసుకోవడం తనకు అలవాటని, అత్తింట్లో పూజ చేసుకునే సమయంలో తనను అడ్డుకున్నారని చెప్పారు. దేవుళ్ల ఫొటోలు పెట్టుకుని పూజ చేస్తుండగా అడ్డుకుని, హారతి, అగరుబత్తీలు లాక్కుని పడేశారని, తనపై దాడి చేశారని ఆరోపించారు. మత విశ్వాసాలు వ్యక్తిగతమైనవేనని, అయితే వాటి గురించి ముందే వాస్తవాలు చెప్పకుండా వివాహం చేయడం మోసం కాదా అని ప్రశ్నించారు. తనపై జోగి రమేష్ కుటుంబం తప్పుడు ప్రచారం చేస్తోందని మేఘన ఆరోపించారు. తాను ఎవరినైనా కలిస్తే రాజకీయంగా ఎవరో నడిపిస్తున్నారని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తన వద్ద ఇంకా చాలా ఆధారాలు ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు వాటిని బయటపెడతానని చెప్పారు. మేఘన తండ్రి అనంతకృష్ణ గౌడ్ కూడా జోగి రమేష్ కుటుంబంపై తీవ్ర ఆరోపణలు చేశారు. తమది రాజకీయ కుటుంబం కాదని, వ్యాపార కుటుంబమని చెప్పారు. తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, తన కుమార్తె జీవితాన్ని నాశనం చేశారని ఆరోపించారు. రాజీవ్కు ఉన్న సమస్యలు ముందే తెలిసి ఉంటే ఎందుకు వివాహం చేశారో జోగి రమేష్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించేందుకు తాము పలుమార్లు ప్రయత్నించినా సానుకూల స్పందన రాలేదన్నారు. పెళ్లయిన కొద్దికాలానికే విడాకుల పిటిషన్ దాఖలు చేయడం వారి వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. తన కుమార్తెకు న్యాయం చేసి ప్రశాంతమైన జీవితం కల్పించాలని అనంతకృష్ణ గౌడ్ కోరారు. న్యాయం జరగకపోతే జోగి రమేష్ ఇంటి ముందు కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేస్తామని, అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ను కలిసి న్యాయం చేయాలని కోరతామని తెలిపారు.

# శ్రీశైలం వడ్డెర సత్రంలో దారుణం

**ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య**

**నెలరోజులుగా సత్రంలోనే ఉండడంపై అనుమానాలు**

**నంద్యాల :** శ్రీశైలంలో విషాద ఘటన చోటు చేసుకుంది. శ్రీశైలం వడ్డెర అన్నదాన సత్రంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఊరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. గత 3 రోజులుగా రూమ్ నుంచి బయటకు రాకపోవడంతో పాటు దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన సత్రం నిర్వాహకులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని తలుపులు తెరచి చూడగా బాత్రూమ్లో ముగ్గురు మహిళలు, ఫ్యాన్కు ఇద్దరు పురుషులు ఉరివేసుకొని కనిపించారు. మృతులు సుధాకర్(36), గోగుల ఆదిలక్ష్మి(50), మల్లేశ్వరి(45), శ్రీదేవి(33), మణికంఠ(15)గా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. శ్రీశైలం వడ్డెర సత్రంలో సంఘటనా స్థలాన్ని ఆలయ ఈవో శ్రీనివాసరావు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమేష్ నాయుడు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ పరిశీలించారు. సుధాకర్ కుటుంబ సభ్యులు.. గత నెల 28వ తేదీన శ్రీశైలం వడ్డెర సత్రం రూమ్ నెంబర్ 11లో రూ. 800 చెల్లించి అద్దెకు తీసుకున్నారు. రెండు రోజుల తర్వాత ఖాళీ చేయాలని సత్రం నిర్వాహకులు చెప్పినప్పటికీ.. అనారోగ్యంతో వచ్చామని, మరికొద్ది రోజులు ఉండి పూజలు చేయించుకుంటామని సుధాకర్ చెప్పినట్లు సమాచారం. రోజుకు 800 రూపాయలు చెల్లిస్తూ వ్డడెర సత్రంలోనే సుధాకర్ కుటుంబ సభ్యులు ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. మృతులు సత్యసాయి జిల్లా బత్తలపల్లి గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ఐదుగురి మృతదేహాలను కిందకు దించిన శ్రీశైలం పోలీసులు.. శవ పరీక్షల కోసం సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా వడ్డెర సత్రం యాజమాన్యం.. యాత్రికులకు నెల రోజులపాటు రూమును ఎందుకు అద్దెకు ఇచ్చారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతిచెందిన వ్యక్తులు శ్రీశైలంలో నెల రోజులపాటు ఎందుకు ఉన్నారనే కోణంలోనూ విచారణ చేపట్టారు.




Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District